క్లుప్తంగా

మానవ హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ సీలార్ సాహెబ్

మధిర: స్థానిక వెలుగు సమాఖ్య కార్యాలయంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ మధిర డివిజన్ అధ్యక్షుడు కోట వెంకట్ ఆధ్వర్యంలో గురువారం మానవ హక్కుల, వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం, సమాచార హక్కు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి సీలార్ సాహెబ్ పాల్గొని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఏపీఎం ఉపేంద్రమ్మ, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ నిస్సి, ఖమ్మం జిల్లా అడ్వైజర్ యశోద, మదిర డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ పనులు పరిశీలన



సెంట్రల్ లైటింగ్ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్

వైరా: వైరా మున్సిపాలిటీలో శాంతినగర్ నుంచి తల్లాడ రోడ్ బాట్లింగ్ యూనిట్ వరకు మెయిన్ రోడ్డులోని సెంట్రల్ లైటింగ్ పనుల మరమ్మతులను మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ గురువారం పరిశీలించారు. అస్తవ్యస్తంగా ఉన్న లైట్లను తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయించారు. సెంట్రల్ లైటింగ్ కాంట్రాక్టర్‌కు సూచనలు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎలక్ట్రికల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు వితరణ



నోటు పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో సుదర్శన్ ఫౌండేషన్ నిర్వాహకులు, సర్పంచ్

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సుదర్శన్ ఫౌండేషన్ నిర్వాహకులు రూ.26 వేల విలువైన నోట్ పుస్తకాలు, పెన్నులు వితరణ చేశారు. వీటిని గురువారం సుదర్శన్ ఫౌండేషన్ బాధ్యుడు జగదీష్, ప్రిన్సిపాల్ ఎస్.రమణారెడ్డి, సర్పంచ్ జంగ పుల్లారెడ్డిలు అందించారు. దీంతో దాత జగదీష్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో యన్నం సత్యనారాయణరెడ్డి, శీలం అంకిరెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



బద్రి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొణిజర్ల: మండలంలోని మల్లుపల్లికి చెందిన బానోత్ బద్రి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. వారు నిరుపేద కుటుంబం కావడంతో వైరా నియోజకవర్గ నాయకుడు బానోత్ బాలాజీ నాయక్ తన కుమారులు నరసింహారావు, బాబూరావులు రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు సౌందర్య, కోటేష్, వెంకన్న, వెంకట్ సీతమ్మ, నవీన్, జయరామ్, నానిక్య, నరసింహారావు, కళావతి తదితరులు పాల్గొన్నారు.

రామనాథంకు సన్మానం



రామనాథాన్ని సన్మానిస్తున్న నాయకులు

మధిర: టీడీపీ ఖమ్మం పార్లమెంటరీ అధ్యక్షుడిగా నియామకమైన డాక్టర్ వాసిరెడ్డి రామనాథంను గురువారం మధిరలో టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావట్ల సత్యనారాయణ, సాదినేని హనుమంతరావు, మరీదు బరకయ్య, తూము పురుషోత్తం, పారా వెంకటేశ్వరరావు, చిత్రాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇదేనా.. పల్లె ప్ర'గతి'?

- సమస్యల వలయంలో కుంచపర్తి
- డ్రెయినేజీలు లేక నిలుస్తున్న మురుగునీరు
- అంతర్గత రహదారుల వెంట పిచ్చి మొక్కలు



ఇళ్ల ముందు నిలిచిన మురుగు నీరు



అధ్వానంగా ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లే రహదారి

వేంసూరు: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ప్రవేశపెట్టిన పల్లెప్రగతి క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. పంచాయతీ పాలకవర్గం, అధికారులు దృష్టి సారించకపోవడంతో పల్లెల్లో పారిశుద్ధ్య సమస్య నెలకొంది. మండల పరిధిలోని 540ఇళ్లు, 2,068 జనాభా కల్గిన కుంచపర్తి గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసింది. పట్టించుకునేవారు లేక సమస్యలతో ఇక్కడ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ఇళ్లముందే మురుగు నీరు..

గ్రామంలో డ్రెయినేజీ, అంతర్గత రహదారుల వెంట సైడ్ కాలువలు సరిగా లేకపోవడంతో ఇళ్ల ముందే మురుగు నీరు రోజుల తరబడి నిల్వ ఉంటుంది. అయినా పంచాయతీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమలతో ఎటువంటి ఎటువంటి ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామంలో పలుచోట్ల ప్రధాన, అంతర్గత రహదారుల వెంబడి చెత్త పెంటకుప్పలుగా ఉండటంతో దుర్వాసన వెదజల్లుతుంది. చెత్తను సేకరించేందుకు ఏర్పాటు చేసి చెత్తకుండిల్లోని చెత్తను ఏరోజుకారోజు తరలించకపోవడంతో దోమలు, ఈగలకు నిలయాలుగా మారాయి. ప్రతీరోజు చెత్తను తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కుంచపర్తి సెంటర్ నుంచి జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లే రహదారి వర్షం కురిసిన ప్రతిసారి బురదమయంగా ఉటుంది. దీంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లలేక నానా అవస్థలు పడుతున్నారు. కావున అధికారులు స్పందించి విద్యార్థుల సౌకర్యార్థం సీసీ రోడ్డు వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పిచ్చి మొక్కలతో అంతర్గత రహదారులు..

గ్రామంలోని పలు అంతర్గత రహదారుల వెంట పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. కుంచపర్తి ప్రధాన సెంటర్ సమీపంలోని అంతర్గత రహదారి, మంచి నీళ్ల చెరువు సమీపంలో అంతర్గత రహదారుల వెంట మొలచిన పిచ్చి చెట్లు, మొక్కలతో రహదారి అగుపడక నడవాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీని కారణంగా పలుమార్లు పాములు కూడా సంచరిస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.



అంతర్గత రహదారుల వెంట పిచ్చి మొక్కలు

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి..



గ్రామంలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యను అధికారులు దృష్టి సారించి పరిష్కరించాలి. రానున్నది వ్యాధులు కాలం కావడంతో దోమల నియంత్రణపై దృష్టి సారించాలి.

– ఆరెంపుల కృష్ణ, కుంచపర్తి గ్రామస్తుడు

మురుగునీరు లేకుండా చేయాలి..



అంతర్గత రహదారులకు డ్రెయినేజీ, సైడ్ కాలువలు సరిగా లేకపోవడంతో ఇళ్లముందు మురుగునీరు నిల్వ ఉంటుంది. కావున నీరు నిల్వ ఉండకుండా అధికారులు సైడ్‌డ్రెయిన్స్ నిర్మించాలి.

– కిన్నెర పుల్లయ్య, కుంచపర్తి గ్రామస్తుడు

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



బనిగండ్లపాడులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

ఎర్రుపాలెం: రాష్ట్రంలోని ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. గురువారం మండలంలోని బనిగండ్లపాడు, తక్కెళ్లపాడు, కొత్తపాలెం తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను పరామర్శించారు. బనిగండ్లపాడు గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు అందించే విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మధిర ఏఎంసీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, ఎంపీపీ దేవరకొండ శిరీష, బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పంబి సాంబశివరావు, యన్నం శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు జంగా పుల్లారెడ్డి, మొగిలి అప్పారావు, యన్నం సత్యనారయణరెడ్డి, నీలం రవి, శీలం నరేందర్‌రెడ్డి, శీలం కృష్ణారెడ్డి, సూరానేని రామకోటేశ్వరరావు, కత్తి రవి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి యువత కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణచైతన్య

ముదిగొండ: బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి యువత కృషి చేయాలని బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చింతనిప్పు కృష్ణచైతన్య యువతకు పిలుపునిచ్చారు. ముదిగొండలోని కొమ్మూరి రమేష్ నివాసంలో మండల యవజన యూత్ విభాగం అధ్యక్షుడు బండ్ల వాసు అధ్యక్షత గురువారం మండల విభజన విభాగం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ.. యవకులు పార్టీకి రథసారధులుగా ముందుండాలని అన్నారు. మూడోసారి ముఖ్యమంత్రిగా మళ్లీ కేసీఆర్‌కు పట్టం కట్టాలని అన్నారు. సమావేశంలో నాయకులు బలుసు మురళీకృష్ణ, మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి నరేందర్‌రెడ్డి, వాసు, దరివల్లి వీరబాబు, దారా రాము, పాషా తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

కల్లూరు: సమస్యల పరిష్కారం కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, అరకొర వేతనాలతో వారి కుటుంబ పోషణ కష్టంగా మారిందన్నారు. మండల పరిధిలోని పాఠశాలల్లో వంట కార్మికులకు రూ.52 లక్షలు పెండింగ్ బిల్లులు, వేతనాలు, కోడిగుడ్డు బిల్లుల బకాయిలు ఉన్నాయన్నారు. గత 8 నెలలుగా బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులను అప్పులపాలు చేస్తుందన్నారు. ఈ మేరకు ఆర్‌డీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, సీపీఐ మండల కార్యదర్శి దామాల దయాకర్, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ మండల నాయకులు పాగా సత్యవతి, రమాదేవి, అలివేలు, రామ్‌కుమారి, అప్పమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

పంచాయతీ కార్మికుల కోసం సీపీఎం బిక్షాటన



బిక్షాటన చేస్తున్న సీపీఎం నాయకులు

ఎర్రుపాలెం: గ్రామ పంచాయతీ కార్మికుల కోసం మండల కేంద్రంలోని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పలువురు నాయకులు బిక్షాటన చేశారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటుగా ప్రైవేట్ కార్యాలయాలు, హోటల్స్‌లో బిక్షాటన చేసి రూ.5,500ల నగదును పార్టీ మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య పంచాయతీ కార్మికులకు అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గంతాల నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, సగ్గుర్తి సంజీవరావు, బేతి శ్రీనివాసరావు, దేవరకొండ రామకృష్ణ, కన్నెబోయిన శ్రీనివాసరావు, తాళ్లూరి వెంకటనారాయణ తదితరులున్నారు.

కల్లూరు మండల ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



కల్లూరు: కల్లూరు మండల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ధర్నాసి బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా కోట పుల్లయ్య, ఉపాధ్యక్షుడిగా ఉబ్బన బాబూరావు, కోశాధికారిగా వేము మోహన్ బాబు, గౌరవ అధ్యక్షుడిగా దాసరి డేవిడ్ రాజు, సహాయ కార్యదర్శిగా బొల్లం శంకర్, ప్రచార కార్యదర్శులుగా జానపాటి రోజ్‌వేణు, ఇస్లావత్ రాంప్రసాద్, గౌరవ సలహాదారులుగా బి.వెంకటరామారావు, కె.గురవయ్య, ఎస్.అరుణ్, రాజేష్‌రెడ్డి, షేక్ ఫజిలుద్దీన్, లీగల్ అడ్వైజర్‌గా ఎండీ.గౌస్‌పాషా, కార్యవర్గ సభ్యులుగా ఖమ్మంపాటి అప్పారావు, జర్పుల సురేష్, సింగిశాల కోటిరత్నం, మహేష్, సంగెపు రామకృష్ణ, పరిగడపు బాబూరావులు ఎన్నికయ్యారు.

బాధ్యతలు స్వీకరించిన ఎక్సైజ్ సీఐ



ఎక్సైజ్ సీఐ రాజశేఖర్‌రావు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఎక్సైజ్ సీఐగా వేమ రాజశేఖర్ రావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ రాంప్రసాద్ ఇల్లెందుకు బదిలీపై వెళ్లడంతో ఆస్థానంలో రాజశేఖర్‌రావును నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పనిచేస్తూ.. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన అధికారులు

ముదిగొండ: మండలంలోని పెద్దమండవ, వల్లబి, కమలాపురం, చిరుమర్రి, ముదిగొండలలోని పోలింగ్ స్టేషన్లను గురువారం స్థానిక తహసీల్దార్ శిరీష, ఎస్సై నరేష్ లు కలిసి పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లోని మౌళిక వసతులు, పరిసరాలు, విద్యుత్ సౌకర్యం వంటి వాటిని పరిశీలించారు. ఆర్ఐ లు వహిదా, ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థినులకు సత్కారం

కొణిజర్ల : ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు ఆర్యవైశ్య సంఘం నాయకులు గురువారం ఘనంగా సత్కరించారు. 2023లో జరిగిన పది పరీక్షల్లో కొణిజర్ల జెడ్పీ పాఠశాలకు చెందిన జలక ఉమాదేవి 9.7 శాతం, చిన్నం నందిని 9.5 శాతం జీపీఏ సాధించారు. దీంతో వారిని ఖమ్మంలో నిర్వహించిన సమావేశంలో బాలికలను సత్కరించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, కొణిజర్ల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు, కేసు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని విరాట్‌నగర్‌కు చెందిన ఎస్.కే.ఖాజాపై ఆయన భార్య రవీనా చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. అదనపు కట్నం తీసుకురావాలని ఆయన వేధిస్తుండడంతో భార్య చేసిన ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కళ్లకు గంతలతో వినూత్న నిరసనలు

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. నిరసనలో భాగంగా సమ్మె శిబిరం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని, మోకాళ్లపై వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సమ్మెలకు పలు పార్టీలు, సంఘాల నాయకులు మద్దతు ప్రకటించి జీపీ కార్మికుల న్యాయమైన సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



తల్లాడ: సంఘీభావం తెలుపుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

రైతు డిక్లరేషన్ బూటకం..



సత్తుపల్లి: గంగారం సబ్‌స్టేషన్ వద్ద ఆందోళనలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య, నాయకులు

సత్తుపల్లి/సత్తుపల్లిరూరల్: రైతులకు మూడు గంటలు విద్యుత్ చాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే.. రాహుల్ గాంధీ ప్రకటించిన రైతు డిక్లరేషన్ మొత్తం బూటకమని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. సత్తుపల్లిలోని గంగారం సబ్‌స్టేషన్ వద్ద రేవంత్‌రెడ్డి వ్యాఖ్యను నిరసిస్తూ గురువారం కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను ఉరివేసి దహనం చేశారు. అదే విధంగా మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన నక్క అనపూర్ణ మృతి చెందగా ఆమె కుటుంబానికి రూ.2 లక్షల బీఆర్ఎస్ పార్టీ బీమా చెక్కును ఎమ్మెల్యే అందించారు. పార్టీ సభ్యత్వం ఉండి మృతి చెందిన కుటుంబాలకు పార్టీ అండగా నిలుస్తుందన్నారు. అదే విధంగా పట్టణానికి చెందిన రజక సంఘం అధ్యక్షుడు, 20వ వార్డు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాము ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన స్వగృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాలల్లో ఎంపీపీ దొడ్డా హైమావతి, జెడ్పీటీసీ సభ్యులు కూసంపూడి రామారావు, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు, ఎస్‌కే.రఫీ, వనమా వాసు, మందపాటి శ్రీనివాసరెడ్డి, సామేలు, ఎంపీటీసీ పాలడుగు సునీత, రాజు, కొడిమెల అప్పారావు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఆత్మకమిటీ చైర్మన్ వనమా వాసు, మల్లూరు అంకమరాజు, గజ్జెలి శ్రీను పాల్గొన్నారు.

పరామర్శ..

తల్లాడ: మండలంలోని ముద్దునూరు గ్రామంలో ఖమ్మంపాటి కాంతమ్మ(95) గురువారం మృతి చెందింది. ఆమె మృతదేహం వద్ద ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నివాళులర్పించారు. అలాగే కుటుంబీకులను పరామర్శించారు. ఆయన వెంట రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, డి.వెంకట్‌లాల్, భద్రరాజు, దాసురావు, జీవీఆర్, రాము, రేణుక, ప్రసాద్, హనుమంతురావు, శ్రీను, వెంకటేశ్వర్లు, నరసింహారావు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేకి రేవంత్ రెడ్డి



రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మధిర: రైతు వ్యతిరేకి రేవంత్ రెడ్డి అని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కనుమూరి వెంకటేశ్వరావు అన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అవసరం లేదని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ రైతు బంధు, రైతు బీమా లాంటి పథకాలను ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అరిగే శ్రీనివాసరావు, జేవీ రెడ్డి, అప్పారావు, కృష్ణ నాయక్, గద్దల రాజా, వేల్పుల శివ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి



కాంగ్రెస్ మేనిఫెస్టో పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ఏన్కూరు: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ వైరా నియోజకవర్గ నాయకులు ధరావత్ రామ్మూర్తి నాయక్ అన్నారు. గడగడపకు కాంగ్రెస్ పార్టీ మానిఫెస్టో ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని తిమ్మరావుపేట, రంగాపురం, ఏన్కూరు తదితర గ్రామాలలో ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులు రుణాలు రూ.2 లక్షలు మాఫీ చేస్తామన్నారు. రైతులను ఇబ్బందుల పాలుచేస్తున్న ధరణి పోర్టల్ రద్దుకు కాంగ్రెస్‌పార్టీ కట్టుబడి ఉంటుందన్నారు. రూ.4 వేలు ఫించన్, రైతుకు పెట్టుబడి సాయం రూ.15 వేలు, ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అమలు చేసి తీరుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పెర్ల ఆనంద ప్రసాద్, తాళ్లూరి నరసింహారావు, గుర్రం రవి, జాహీద్, జానీమియా, సీతయ్య, నవీన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక..



సర్పంచ్ రాణికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పెనుబల్లి: మండలంలోని రామచందర్‌రావుబంజర్ గ్రామ సర్పంచ్ వాసం రాణి, ఉప సర్పంచ్ యలమంచిలి కల్పనలు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ గ్రామ నాయకుడు అలుగోజు చిన్న నరసింహాస్వామి ఆధ్వర్యంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వీరికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితో పాటు పలువురు గ్రామస్తులు కూడా పార్టీలో చేరారు.

రైతుల పొలాలకు అండర్‌పాస్ ఇవ్వాలి



రైతులతో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

ముదిగొండ: రైతుల పొలాలకు వెళ్లేందుకు అండర్‌పాస్ ఇవ్వాలని రాష్ట్ర కిసాన్‌మోర్చా అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. నేషనల్ హైవే పనుల్లో భాగంగా లింక్ రహదారులన్నీ మూసివేయడంతో ముదిగొండ, వెంకటాపురం, రాఘవాపురం రైతులు గురువారం శ్రీధర్‌రెడ్డిని కలిసి తమ పొలాలకు అండర్‌పాస్ ఇవ్వాలని కోరి.. తాము ఇదివరకే కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నామని తెలిపారు. దీంతో ఆ జాతీయ రహదారిని పరిశీలించాక కేంద్ర మంత్రులతో మాట్లాడుతానని రైతులకు చెప్పారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు యరబోలు వేణుగోపాల్ రెడ్డి, మండల అధ్యక్షుడు కొమ్మినేని సుధాకర్, రైతులు మందరపు ఉపేందర్, కొమ్మూరి వెంకయ్య, ఉన్నం వెంకయ్య, రవి, నాగయ్య, శ్రీను పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గొయ్యి..!



రహదారిపై ఏర్పడిన గొయ్యి



గొయ్యిని పూడ్చిన ఆటోడ్రైవర్లు, స్థానిక యువకులు

ఇల్లెందు–కారేపల్లి ప్రధాన రహదారిలో బ్రహ్మంగారి గుడి ముందు గొయ్యి పడింది. గురువారం కురిసిన వర్షానికి నీళ్లు నిలవడంతో.. వాహనదారులకు గొయ్యి కనపడక కిందపడడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో కారేపల్లి కవిత ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలి ద్విచక్రవాహనం గొయ్యిలో అదుపు తప్పి కిందపడి గాయాలపాలైంది. కాగా, ఆటోడ్రైవర్లు జైత్రం, బాబా, స్థానికులు తోకల సాయి, మేకల సతీష్, సమ్మయ్యలు స్పందించి కంకరతో గొయ్యిని తాత్కాలికంగా పూడ్చివేశారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గొయ్యికి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– కారేపల్లి

పండంటి బిడ్డకు జన్మనిచ్చి.. ప్రాణాలు విడిచి..

- కాన్పు కోసం ఆస్పత్రికి వచ్చిన గర్భిణి మృతి
- మృతురాలి స్వస్థలం మధిర



వెంకటేశ్వరమ్మ (ఫైల్)

నందిగామ: కాన్పు కోసం వచ్చిన ఓ మహిళ బిడ్డకు జన్మనిచ్చాక మృతి చెందిన ఘటన ఎన్టీఆర్ జిల్లా నందిగామలో చోటుచేసుకుంది. నందిగామ మండలం జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధి మాగల్లుకు బొజ్జగాని వెంకటేశ్వరమ్మ(23)కు నెలలు నిండడంతో కుటుంబీకులు బుధవారం రాత్రి నందిగామ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆమెకు గురువారం ఉదయం వైద్యులు ఆపరేషన్ చేయగా ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ఆ తర్వాత వైద్యులు వెంకటేశ్వరమ్మను హడావుడిగా విజయవాడకు తరలించగా, ఏం జరుగుతుందో తెలియక కుటుంబీకులు మరో వాహనంలో వెళ్లారు. అక్కడ వైద్యులు వెంకటేశ్వరమ్మ మృతి చెందిందని వెల్లడించగా, వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ బంధువులు నందిగామలో ఆందోళనకు దిగారు. ఈ విషయమై నందిగామ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణను వివరణ కోరగా ఊపిరితిత్తుల్లో ఉమ్మ నీరు చేరడంతో వెంకటేశ్వరమ్మ మృతి చెందిందని తెలిపారు. కాగా, ఖమ్మం జిల్లా మధిరకు చెందిన వెంకటేశ్వరమ్మకు మాగల్లుకు చెందిన చంద్రశేఖర్‌తో ఐదేళ్ల క్రితం వివాహం జరగగా మొదటి కాన్పులో కుమారుడు జన్మించాడు. ఇప్పుడు రెండో కాన్పులో ఆడబిడ్డకు జన్మనిచ్చిన ఆమె మృతి చెందింది. ఈ సమాచారం తెలుసుకున్న ప్రభుత్వ విప్ సామినేని, ఉదయభాను కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కమ్మినేని రవిశంకర్ తదితరులు ఆస్పత్రికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.